# తాగునీటి సమస్యను అధిగమించాలి

■ వికారాబాద్‌కలెక్టర్ ప్రతీక్‌జైన్ ■ సంబంధిత అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఏప్రిల్ 25 : జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణతో ప్రణాళిక ప్రకారం సమస్యను అధిగమించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా పత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాకు సంబంధించి పైపుల మరమ్మత్తులు, బోర్ల నుంచి నీటిని సరఫరా చేసేందుకు వీలుగా బోరు మోటర్ల కొనుగోలు తదితర పనులు చేపట్టాలన్నారు. బోర్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నీటి సరఫరా విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అవసరమైన స్థానిక వనరులను ఉపయోగించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి కావాల్సిన నిధులను మంజూరు చేస్తానని కలెక్టర్ తెలిపారు. బోర్ల ద్వారా నీటి నిల్వ నిమిత్తం నిరుపయోగంగా ఉన్న పాత ఓహెచ్‌ఎస్‌ఆర్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, సీపీవో వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవి, చల్మా రెడ్డి, డీఈలు పాల్గొన్నారు.

## ప్రజావాణి వాయిదా

**వికారాబాద్ :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశం హాలులో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భూ భారతి రైతు అవగాహన సదస్సులు నిర్వహిస్తుండడంతో ఈ నెల 28న జరగాల్సిన ప్రజావాణిని వాయిదా వేశామన్నారు. మే 5నుంచి తిరిగి యథావిధిగా ప్రతి సోమవారం ప్రజావాణి కొనసాగుతుందని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని, కలెక్టరేట్ కార్యాలయానికి ఎవరూ రాకూడదని కోరారు.

# ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం

◆ ఎస్పీ నారాయణ రెడ్డి ◆ తాండూరు, పరిగి పట్టణాల్లో తనిఖీ బృందాలు

బస్టాండ్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న బీడీ టీమ్ సిబ్బంది

వికారాబాద్, ఏప్రిల్ 25 : జిల్లా ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యమని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి పట్టణంలోని బస్టాండ్లలో బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించేందుకు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే అనుమానాస్పద వస్తువులు, నార్కోటిక్స్ రవాణాను అరికట్టేందుకు ఈ ప్రత్యేక తనిఖీలను చేపడుతున్నామన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరరహిత సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. ఈ తనిఖీల్లో బీడీ టీమ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది అత్యాధునిక పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# ప్రతి భూమికీ భూధార్ సంఖ్య

■ రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి,
■ రైతులకు భూభారతి చట్టంపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

మాడ్గుల, ఏప్రిల్ 25 : ప్రతి భూమికీ భూధార్ సంఖ్యను కేటాయించి హక్కులు కల్పిస్తామని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా పట్టాదారు పాసు బుక్కులో తప్పులు ఉంటే తహసీల్దార్ వద్దనే రైతుల సమస్యలు పరిష్కారం అవుతుందని చెప్పారు. వారసత్వ భూమి చేసుకోవడానికి 30 రోజుల సమయంలో చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో తప్పులు జరుగకుండా ఉండే అవకాశం ఉందన్నారు. మండలానికి ఇద్దరు సర్వేయర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన బోరు మోటర్లను 55 మందికి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 35 మందికి సీఎం సహాయ నిధి చెక్కులు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినయ్ సాగర్, డీటీ రాజశేఖర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, నాయకులు రాంరెడ్డి, కిషన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహ, పెద్దయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### నూతన చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం

**ఆమనగల్లు :** భూభారతి చట్టం ద్వారా రైతుల భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నూతన ఆర్‌వోఆర్ చట్టం- 2025పై పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఈ చట్టంలో అప్పీలు వ్యవస్థ కీలకమన్నారు. రైతుకు అన్యాయం జరిగితే ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్‌ఏ స్థాయిల్లో అప్పీలు చేసుకోవడం ద్వారా న్యాయాన్ని పొందవచ్చన్నారు. అనంతరం ఆమనగల్లు బార్ ఆసోసియేషన్ కార్యవర్గ సహ్యులు కలెక్టర్‌ను కలిసి నూతన కోర్టు భవనానికి స్థలం కేటాయించాలని, జిల్లా కోర్టును రంగారెడ్డి కోర్టుకే అనుసంధించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, ఏఎంసీ చైర్మన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, ఏడీఏ శోభారాణి, తహసీల్దార్ లలిత, ఎంపీడీవో కుసుమ మాధురి, ఎంఈవో పాండు, ఏంఎవో అరుణ కుమారి, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు తరలి రావాలి

● పల్లె పల్లెకూ బస్సుల ఏర్పాటు ● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి

మొయినాబాద్, ఏప్రిల్ 25 : తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పురుడు పోసుకున్న భారత రాష్ట్ర సమితి రజతోత్సవ మహాసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల పాలనలో తీవ్ర అన్యాయానికి గురవుతున్న సమయంలో తెలంగాణలో ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం చాలా అవసరమని భావించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇతర పార్టీల నుంచి బయటకు వచ్చి స్వరాష్ట్ర ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. తెలంగాణ కోసం ఉద్యమించడానికి ఒక వేదిక కావాలని ఆలోచించి 24 ఏండ్ల క్రితం పార్టీని స్థాపించారని తెలిపారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులను ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకులు హరిస్తున్నారని, ఇక్కడి ప్రజలకు రావాల్సిన నిధులు, నీళ్లు, నియామకాలను దోచుకుంటున్నారని తెలిపారు. మన నిధులు, మన నీళ్లు, మన నియామకాలు రావాలని తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్రం కోసం కోసం కేసీఆర్ ఆంధ్ర పాలకులపై గళమెత్తి తెలంగాణ ప్రజలను ఏకం చేసి ఉద్యమించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏండ్లు విరామం లేకుండ సుదీర్ఘ పోరాటం చేశారని, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారని తెలిపారు. ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి, మేధావులు, కవులు, కళాకారులు, కార్మికులు, కర్షకుల నుంచి మద్దతును కూడ గట్టి ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపి అప్పట్లో ఉన్న యూపీ ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారని తెలిపారు. అధికారం చేపట్టిన పదేండ్ల పాటు ప్రజలకు అన్ని విధాలుగా ప్రయోజనాలు చేకూరేలా పారదర్శకమైన పాలన అందించి చరిత్రలో నిచారని తెలిపారు. భారత రాష్ట్ర సమితి ఏర్పడి 25 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో రజతోత్సవ మహాసభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రజతోత్సవ సభకు తరలిరావడానికి ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ఉన్న బీఆర్ఎస్ అగ్ర నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని నాయకులు, కార్యకర్తలను తరలించాలని పిలుపునిచ్చారు. సభకు రావడానికి బస్సుల ఏర్పాటుతో పాటు వారికి మంచినీళ్లు, భోజనాలు సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ద్వితీయ భాషగా తెలుగును కొనసాగించాలి

కొండాపూర్, ఏప్రిల్ 25 : ఇంటర్మీడియట్ బోర్డు ద్వితీయ భాషగా తెలుగును కొనసాగించాలంటూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యాపక బృందం శుక్రవారం తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ డైరెక్టర్, సెక్రటరీ శ్రీకృష్ణ ఆదిత్య, రీజనల్ జాయింట్ డైరెక్టర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.జయప్రదాబాయిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ తెలుగు అధ్యక్షుడు పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ ద్వితీయ భాష తెలుగు స్థానంలో సంస్కృతం పెట్టాలని భావిస్తున్నట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో బోర్డు అధికారులను కలిసినట్లు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య గోనానాయక్, ఆచార్య త్రివేణి వంగరి, డాక్టర్ భూక్య తిరుపతి పాల్గొన్నారు.

## ఎర్లీబర్డ్‌కు ఐదు రోజులే గడువు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ.1000 కోట్ల పన్ను వసూలు చేయాలని లక్ష్యాన్ని ఖరారు చేసిన కమిషనర్ ఇలంబర్తి..టార్గెట్ ఛేదించేందుకు స్పెషల్ డ్రైవ్ ముమ్మరం చేశారు. శుక్రవారం వరకు 5.82 లక్షల మంది ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోగా... తద్వారా రూ. 558.71 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నది. మరో 5 రోజుల్లో ఎర్లీబర్డ్ స్కీం ముగుస్తుండడం, రూ.441. 29 కోట్ల మేర రావాల్సి ఉంది.

కడ్తాల్, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి తారక రామారావును కల్వకుర్తికి చెందిన పార్టీ నాయకులు, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ శుక్రవారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపుర్వకంగా కలిశారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభ ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలోని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, మాజీ సర్పంచ్‌లు గోపాల్ నాయక్, వెంకట్ రెడ్డి, గణేశ్, బుచ్చిబాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బిచ్చిరెడ్డిని పరామర్శించిన శుభప్రద్ పటేల్

బషీరాబాద్, ఏప్రిల్ 25 : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కాంగ్రెస్ నాయకుడిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ శుక్రవారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కొంత మంది నాయకులు అవమానిస్తూ, గ్రామస్తుల ఎదుట అవమాన పరుస్తున్నారని మైల్వార్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బిచ్చిరెడ్డి గురువారం పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు వికారాబాద్ మిషన్ అస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న శుభప్రద్ పటేల్ బీఆర్ఎస్ నాయకుడు (బిచ్చిరెడ్డి సోదరుడు) హన్మంత్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడ ఉన్న వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

## ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ప్రీ పీహెచ్‌డీ (పీహెచ్‌డీ కోర్స్ వర్క్) పరీక్షలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికీ, వివిధ సాంకేతిక కారణాల రీత్యా వాయిదా వేసుకున్నట్లు వివరించారు. పరీక్షలను తిరిగి నిర్వహించబోయే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## లాంగ్వేజెస్ కోర్సుల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## పోస్ట్ ఎంఎస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ ఎంఎస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

# సిటీలో 208 మంది పాకిస్థానీయులు

- పట్టణంలో కట్టుదిట్టమైన పోలీసు భద్రత
- పాకిస్థానీయుల వివరాలపై కేంద్రం ఆరా
- వెనక్కి పంపాలంటూ హోం మంత్రి అమిత్‌షా ఆదేశాలు
- సిటీలో పోలీసుల స్పెషల్ వెరిఫికేషన్ డ్రైవ్
- గడువు ముగిసిన తర్వాత ఉంటే కఠిన చర్యలు

సిటీబ్యూరో/ చార్మినార్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో సిటీలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. సున్నిత ప్రాంతాలపై దృష్టి పెట్టడంతో పాటు హైదరాబాద్‌లో ఉన్న పాకిస్తానీయులను వెనక్కు పంపడంపై కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చిన కారణంగా వారి వివరాలపై ఆరాతీస్తున్నారు. ఇప్పటివరకు ఎస్‌బీలో రిజిస్టర్ చేసుకున్నవారెందరు, ప్రస్తుతం అనధికారికంగా ఎంతమంది ఇక్కడ నివాసముంటున్నారు. అసలు వారు చేస్తున్న పనులేంటనే విషయాలపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పాతబస్తీలోని పలుప్రాంతాల్లో తమ ఇన్‌ఫార్మర్లను అడిగితెలుసుకుంటున్నారు. ప్రస్తుతం నగరంలో రెండు ప్రధాన కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో అడుగడుగునా కట్టుదిట్టమైన భద్రత కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు కేంద్రం అన్ని రాష్ట్రాలలో ఉన్న పాకిస్తానీయులను వెనక్కు పంపాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడారు. ఈ మేరకు ముందుగా స్థానికంగా ఉంటున్న పాకిస్తానీయులను గుర్తించి వారి వివరాలను కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశం కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద ఎవరైనా ఉంటే 48 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశాలిచ్చింది. మెడికల్ వీసాలు పొందిన వారికి మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు అవకాశం ఉంది.

### పోలీసుల స్పెషల్ వెరిఫికేషన్ డ్రైవ్..

భారత్‌తో పాకిస్తాన్ సంబంధాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. దేశంలో ఉన్న పాకిస్తానీయులను బయటకు పంపడానికి కేంద్రం సిద్ధమైంది. ఈమేరకు అన్ని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో పాకిస్తానీయుల వివరాల సేకరణలో ఇంటిలిజెన్స్ పోలీసులు నిమగ్నమయ్యారు. హైదరాబాద్‌కు వచ్చే అన్ని దేశాల వాళ్లు తమ వివరాలను శంషాబాద్‌లోని మామిడిపల్లి వద్దనున్న ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలి. పాక్, బంగ్లా దేశీయులు మాత్రం పాతబస్తీలోని పురానాహవేలిలో ఎస్‌బీ ఆధీనంలో ఉన్న పాక్, బంగ్లా కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ విభాగంలో ఇప్పటివరకు 208 మంది పాకిస్తానీయులు రిజిస్టరై ఉన్నారు. ఇందులో లాంగ్ టర్మ్ వీసా కలిగినవాళ్లు 156 మంది ఉన్నారు. ఇక్కడి వారిని వివాహం చేసుకున్న వారితో పాటు వారి రక్త సంబంధీకులకు ఈ వీసాలు జారీ చేస్తూ ఉంటారు. మరో 13 మంది విజిట్, బిజినెస్ వీసాలు(షార్ట్ టర్మ్)వీసాలు కలిగి ఉండగా, మిగతావన్నీ మెడికల్ వీసాలని పోలీసులు చెబుతున్నారు. నగరంలోని పాకిస్థానీల్లో సార్క్ వీసా కలిగిన వాళ్లెవరూ లేరని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో నగరంలోని పాకిస్తానీయులు ఎక్కువగా నివసిస్తున్న పాతబస్తీ ప్రాంతంలో పోలీసులు స్పెషల్ వెరిఫికేషన్ డ్రైవ్ చేపట్టారు. వీసా గడువు ముగిసిన తర్వాత కూడా ఇంకా ఎంతమంది అక్రమంగా హైదరాబాద్‌లో ఉన్నారనే దిశగా పోలీసుల డ్రైవ్ జరుగుతోంది. మరికొందరు బిజినెస్, మెడికల్ వీసాలపై వచ్చి ఇక్కడే ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు తయారు చేసుకుని తమ ఐడెంటీని మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని వారి విషయంలో కూడా పోలీసులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. నగరంలో ఉన్న పాకిస్తానీల్లో ప్రస్తుతం ఎంత మంది హైదరాబాద్ లో ఉన్నారు.. ఎవరెవరు పాకిస్తాన్‌కు రిటర్న్ వెళ్లారనే వివరాలను ఇమ్మిగ్రేషన్ నుంచి పోలీసులు తీసుకుంటున్నారు. మరి ఇప్పటివరకు ఎంతమంది వెళ్లారనేది మాత్రం ఖచ్చితమైన వివరాలు ఇంకా పోలీసులకు అందలేదు. మరోవైపు కేంద్రం చాలా సీరియస్‌గా సిటీలో ఉన్న పాకిస్తానీయులను వెనక్కు పంపాలని ఆదేశాలు జారీ చేయడంతో వారిలో కొందరు ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. పాతబస్తీలోని పలుప్రాంతాల్లో ఈ విధంగా తలదాచుకున్నవారి వివరాలు సేకరిస్తూనే వారిని బలవంతంగా తిరిగి వెనక్కు పంపడానికి పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత ఎవరైనా ఉన్నట్లుగా తేలితే వారిని, వారికి ఆశ్రయమిచ్చిన వారిపై కఠినచర్యలు తప్పవని, ఇది దేశభద్రతకు సంబంధించిన అంశమని పోలీసులు హెచ్చరించారు.

### పోలీస్ నిఘాలో భాగ్యనగరం..!

పహల్గాం ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో సిటీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హెచ్ ఐసీసీలో శుక్ర, శనివారాల్లో భారత్ సమ్మిట్, వచ్చేనెల 7 నుంచి 31 వరకు మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చే వారంతా హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న హోటల్స్‌లో బసచేయనున్నారు. దేశంలో టెర్రరిస్ట్ హిట్ లిస్ట్‌లో ఉండే నగరాల్లో హైదరాబాద్ ఒకటి కావడంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. నిఘావర్గాలు ఎప్పటికప్పుడు హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లతో కోఆర్డినేట్ చేసుకుంటూ తాజా పరిణామాలను, సిటీలో జరుగుతున్న వ్యవహారాలను ప్రత్యేకించి సున్నితమైన ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. నగరంలో అనుమానిత, సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో పికెటింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ అతిథుల రాక సందర్భంగా తనిఖీలు కూడా ముమ్మరం చేశారు. ఉగ్రవాద దాడులు ఎక్కడ జరిగినా హైదరాబాద్ మూలాలకు లింక్ ఉండే అవకాశముంటుందని, అందుకోసమే దేశంలో ప్రధాన నగరాల్లో ఒకటిగా హైదరాబాద్‌లో ఇటువంటి సమస్యలు తలెత్తినప్పుడు హైఅలర్ట్ ప్రకటించి భద్రత పెంచుతామని ఒక పోలీస్ అధికారి తెలిపారు.

### నల్లరిబ్బన్లతో ముస్లింల ప్రార్థనలు..!

పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మక్కామసీదులో ముస్లింలు నల్ల రిబ్బన్లు దరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉగ్రవాద దాడిపై ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పిలుపుతో పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. ప్రార్థనల అనంతరం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంతదూరం ర్యాలీ నిర్వహించారు. మరోవైపు శాస్తిపురంలోని మసీదు వద్ద నమాజ్‌కుముందు అసదుద్దీన్ ఒవైసీ నల్ల రిబ్బన్లు పంపిణీ చేశారు. ఆయన తన చేతికి నల్ల రిబ్బన్‌ను దరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

# అవకాడో రాలే.. డబ్బులు పాయే..!

రూ.2.6లక్షలు కోల్పోయిన బాధితుడు

సిటీబ్యూరో, ఏప్రిల్, 25(నమస్తే తెలంగాణ): అవకాడో ఫ్రూట్స్ లోడ్ పంపిస్తామంటూ ఆన్‌లైన్లో ఆర్డర్లు తీసుకుని చివరకు రిపేర్లు, చలాన్లు, సొంత ఖర్చులంటూ రూ.2.6లక్షలు దోచేశారు సైబర్ నేరగాళ్లు. హైదరాబాద్‌కు చెందిన 23 ఏళ్ల బాధితుడు జస్ట్ డయల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడానికి అవకాడోల కోసం వెతుకుతున్నప్పుడు విజయవాడకు చెందిన బాలాజీ ట్రేడర్స్ అనే వ్యక్తి అవకాడోలను సరఫరా చేస్తానని చెప్పారు. ఈ క్రమంలో బాలాజీ ట్రేడర్స్‌కు చెందిన ప్రతినిధులు బాధితుడిని సంప్రదించారు. స్కామర్లు అవకాడోలను డెలివరీ చేయడంలో భాగంగా ఫ్యుయెల్ ఖర్చులు అడగగా బాధితుడు ఒప్పుకున్నాడు. తర్వాత వెహికల్‌రిపేర్ అంటూ కొన్ని డబ్బులు, ఆ తర్వాత ట్రాఫిక్ పోలీసులు ఆపేశారంటూ మరికొన్ని డబ్బులు కావాలంటూ అడగగా బాధితుడు చెల్లించాడు. ఈ నేపథ్యంలో స్కామర్ తన కుమారుడు గతంలో పంపిన డబ్బులు దుర్వినియోగం చేశాడని, వ్యక్తిగత అవసరాల నిమిత్తం కొన్ని డబ్బులు కావాలంటూ అడిగి జరిగిన దానికి తనను క్షమించాలని కోరి బాధితుడిని నమ్మించాడు. బాధితుడి నమ్మకాన్ని పొందడానికి ఒక చెక్ ఫోటో పంపగాదానిని నమ్మి మళ్లీ డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇదంతా కేవలం అవకాడో ఫ్రూట్స్ లోడ్ తెస్తున్